సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 26 । నవంబర్ । 2024



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



రాష్ట్రస్థాయికి క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు క్రీడాకారులను ఎంపిక చేశారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.6 /10.8

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. చలి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

డిసెంబర్ 4న జాతీయ సాధన సర్వే

కామారెడ్డి టౌన్: జిల్లావ్యాప్తంగా 3, 6, 9 తరగతుల విద్యార్థులకు డిసెంబర్ 4న జాతీయ సాధన సర్వే నిర్వహించనున్నట్లు డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వేలో పాల్గొనడానికి జిల్లా వ్యాప్తంగా 150 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా బీఈడీ, పీజీ చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. వారికి ఈ నెల 26, 27, 28 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే 92 మంది పరిశీలకులను నియమించి వారికి 3 సార్లు మాక్ టెస్ట్ చేపట్టామన్నారు. జిల్లాలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులందరూ విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఆదేశించారు.

పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీజీపీఈఏ) కామారెడ్డి శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కామారెడ్డి శాఖ కార్యదర్శిగా వి నందకుమార్ (ఏడీఈ), అదనపు కార్యదర్శిగా బి లక్ష్మినర్సింహ(రామారెడ్డి ఏఈ), జిల్లా కార్యదర్శిగా డి కిరణ్‌చైతన్య (ఏడీఈ, కామారెడ్డి), కోశాధికారిగా జి సుదర్శన్‌రెడ్డి(ఏడీఈ, దోమకొండ) మహిళా ప్రతినిధిగా ఎస్ సాయిచందన (ఏఈ, కామారెడ్డి) ఎన్నికయ్యారు.

జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మండలానికి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్ చేయాలని ఈ నెల 27న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరెని సందీప్ కుమార్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, టీజీఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్, జీవీఎస్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కామారెడ్డి బల్దియా ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీహరి రాజు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌కు కమిషనర్‌గా శ్రీహరి రాజుకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సుజాత ఈ నెల 1న పాల్వంచ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. దీంతో టీపీవో గిరిధర్‌కు బాధ్యతలు అప్పగించారు. అనంతరం రెండు రోజుల్లోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ డీఈ వేణుగోపాల్‌కు బాధ్యతలను అప్పగించారు. అయితే తనకు ఆ బాధ్యతలు వద్దని జిల్లా ఉన్నతాధికారులకు తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరిరాజు బాధ్యతలను అప్పగించారు.

పూజారులు కావలెను!

- పౌరోహిత్యంపై ఆసక్తి చూపని కొత్తతరం
- వేతనం సరిపోక మానేసి పట్టణాలకు వలస
- చదువులు, ఉద్యోగాల వైపే మొగ్గు
- పొరుగు రాష్ట్రాల నుంచి రప్పించే పరిస్థితి





సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఆలయాలకు పూజారుల కొరత ఏర్పడుతోంది. వృత్తిలో కొనసాగుతున్న వారు చాలా మంది వచ్చే వేతనం సరిపోవడం లేదంటూ తప్పుకుంటున్నారు. కొందరు పట్టణాలు, నగరాలకు వలస వెళ్తున్నారు. కొత్తతరం వారు పౌరోహిత్యం వైపు రావడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆలయాల్లో అర్చకుల కొరత నెలకొంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరగడంతో పాటు ఎక్కడికక్కడ పల్లెలు, పట్టణాలు విస్తరిస్తున్న నేపథ్యంలో కొత్తగా ఆలయాలు నిర్మిస్తున్నారు. అయితే ఆ ఆలయాలకు పూజారులు దొరక్కపోవడంతో దీపం వెలిగించలేని పరిస్థితి నెలకొంటుంది. జిల్లాలో దూప, దీప, నైవేద్యం పథకం కింద 301 ఆలయాలు ఉన్నాయి. అలాగే కేటగిరి ఏ కింద మూడు, కేటగిరి బీ కింద రెండు, కేటగిరి సీ కింద తొమ్మిది, కేటగిరి డీ కింద ఒక ఆలయం ఉంది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని పెద్ద ఆలయాల్లో అర్చకులు, సిబ్బంది ఉద్యోగాలను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. వాళ్లకు ప్రభుత్వం నుంచి వేతనాలు వస్తున్నాయి. మిగతా చోట్ల పని చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు.

వివాహాలు కాకపోవడంతో..

ఆడపిల్లల ఆలోచన ధోరణుల్లో వచ్చిన మార్పులతో చాలాచోట్ల అర్చకులకు వివాహాలు కావడం లేదు. బాగా చదివి సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం చేసేవారిని పెళ్లి చేసుకోవడానికి అమ్మాయిలు ఇష్టపడుతున్నారు. ఇది అన్ని కులాల్లోనూ కనబడుతున్న మార్పు. కుల వృత్తులు చేసుకునే వారిని చేసుకుంటే ఊళ్లో ఉండిపోవాలనే భావనకు తోడు, ఉన్నతమైన జీవితం దొరకదనే భావన పెరిగిపోయింది. దీంతో వివాహాల కోసం చాలా మంది మగపిల్లలు కుల వృత్తులు వద్దనుకొని ఉద్యోగాలవైపు వెళ్తున్నారు. అర్చకులుగా, పురోహితులుగా పనిచేసే కొందరు డబ్బులు సంపాదిస్తున్నా, వారిది గౌరవ ప్రదమైన వృత్తి అయినా పెళ్లి చేసుకునే విషయంలో ఆడపిల్లలు ఆసక్తి కనబరచడం లేదు. దీంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఉన్నత చదువులకు పంపిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల నుంచి..

ఆలయాల్లో పూజారులుగా పనిచేయడానికి స్థానికంగా దొరకకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి రప్పిస్తున్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి పూజారులను పిలిపించి వారిని ఆలయ అర్చకులుగా నియమిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే వంద మందికిపైగా అర్చకులు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి చేరారు. కామారెడ్డి పట్టణంలోని పలు కాలనీల్లో ఉన్న ఆలయాల్లో ఇతర రాష్ట్రాల అర్చకులే పనిచేస్తున్నారు. ఇళ్లల్లో సత్యనారాయణ వ్రతాలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు కూడా వారిని పిలుస్తున్నారు. సీజన్‌లో పెళ్లిలకు కూడా పౌరోహితుల కొరత ఏర్పడుతోంది.

కుటుంబ పోషణకు సరిపోని వేతనం

దూప దీప నైవేద్యం పథకం కింద గౌరవ వేతనం, ఆలయ నిర్వహణకు కలిసి నెలకు రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తుంది. ఈ కొద్దిపాటి వేతనంతో నూనె, పువ్వులు, ఇతర సామగ్రి కొనుక్కుని రోజూ దీపం వెలిగించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం ఇస్తున్న వేతనం ఏమాత్రం సరిపోకపోవడంతో చాలా గ్రామాల్లో దూపదీప నైవేద్యం పథకం కింద పనిచేయడానికి అర్చకులు వెనుకడుగు వేస్తున్నారు. పండుగల సమయంలో మాత్రమే ఆలయాలకు భక్తులు బారులు తీరుతారు. మిగతా రోజుల్లో తక్కువగా వస్తారు. దీంతో పురోహితులు పూజ చేసి తిరిగి ఇంటికి వెళ్లాల్సిందే. వాళ్లకు వచ్చే వేతనం కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో చాలా మంది అర్చకులు దూపదీప నైవేద్యం స్కీం కింద ఉన్న గుళ్లలో పని చేయడానికి ఆసక్తి కనబరచడం లేదు. కొందరు ఇప్పటికే మానేశారు. మరికొందరు మానేసే పరిస్థితి ఉంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే అర్చకులకు సంపాదన లేకపోవడంతో చాలా మంది పట్టణాలకు వలస వెళ్తున్నారు. పట్టణాల్లోని ఆలయాల్లో పనిచేస్తే వేతనం ఎక్కువగా దొరకడంతో పాటు పెళ్లిలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు వెళితే ఎక్కువ డబ్బులు ఇస్తుండడంతో చాలా మంది అర్చకులు వలస వెళ్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గడచిన పదేళ్ల కాలంలో వందలాది మంది పురోహితులు హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు ఇప్పుడు కామారెడ్డి పట్టణంలోని కొన్ని ఆలయాల్లో పూజారులు లేక నిర్వహణ ఇబ్బందికరంగా మారింది.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 70 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 70 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఇంటింటి సర్వే పనులు పూర్తి చేయాలని, ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం, వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఫలాహారం, భోజనం, సౌకర్యాలను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులను ప్రతీ ఒక వసతి గృహానికి ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వి విక్టర్, జెడ్పీ సీఈవో చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో బారులు తీరిన ఫిర్యాదుదారులు

సీఎం ప్రకటనతో ఆశావహుల్లో నిరాశ

- మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్టేనా?

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో చేసిన ప్రకటనతో మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్టేనని తెలుస్తోంది. తాను ఇతర పనుల కోసం ఢిల్లీ వెళ్తున్నాని, మంత్రివర్గ విస్తరణ కోసం కాదని ఆయన పేర్కొన్నారు. దీంతో మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్న వారు నిరాశ చెందుతున్నారు. కామారెడ్డి జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. కామారెడ్డికి చెందిన సీనియర్ నేత షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. అయితే రాష్ట్రంలో మైనారిటీ వర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాల్సి ఉందని, మైనారిటీ కోటాలో తనకు అవకాశం దక్కుతుందనే ఆశతో ఆయన ఉన్నారు. సీఎంకు సన్నిహితుడు కావడంతో పాటు మైనారిటీ వర్గం నుంచి ప్రముఖుడిగా పేరుండడంతో తనకు అవకాశం ఇస్తారని ఆయన గట్టి నమ్మకంతో ఉన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ హైకమాండ్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ తనకు పదవి ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చారు. మదన్‌మోహన్‌కు మంత్రి పదవి వస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కూడా ఎస్సీ కోటాలో తనకు అవకాశం ఇవ్వాలని ప్రయత్నాలు చేశారు. అయితే తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్కరికీ పదవి దక్కలేదు. రెండో విడతలో వస్తుందని ఆశతో ఉన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా, ఇప్పటికీ మంత్రి వర్గ విస్తరణ జరగకపోవడంతో ఆశావాహులు నిరాశ చెందుతున్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్

కామారెడ్డి టౌన్: సమాజంలో మహిళలు హింసకు గురవుతున్నారని, అత్యాచారాలు, లైంగిక వేధింపుల నుంచి వారిని కాపాడాలని కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ, వరల్డ్ ఎన్జీవో ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జడ్జి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ జడ్జి సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, కోర్టు సూపరింటెండెంట్స్ వెంకట్ రెడ్డి, భుజంగరావు, శ్రీధర్, చంద్రసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదరం స్లాట్ కోసం అవస్థలు

- రెండు నెలలుగా పనిచేయని వెబ్‌సైట్
- టెక్నికల్ సమస్య అంటున్న అధికారులు
- పింఛన్‌కు దూరం అవుతున్న దివ్యాంగులు

కామారెడ్డి క్రైం: సదరం స్లాట్ బుకింగ్‌కు సంబంధించిన వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తాత్కాలిక సర్టిఫికెట్ పొందిన వారు రెన్యువల్ కోసం, కొత్తగా సదరం శిబిరాలకు వెళ్లడానికి మరికొందరు స్లాట్ బుక్ చేసుకోవడానికి నిత్యం మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. వెబ్‌సైట్ అందుబాటులో లేక ఎలాంటి దరఖాస్తులకు అవకాశం లేకుండా పోయింది. సాంకేతిక సమస్యల కారణంగా వెబ్‌సైట్ పని చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఇతర పింఛన్‌లకు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ దివ్యాంగ పింఛన్ పొందాలంటే వైకల్యం కలిగిన వారు ముందుగా సదరం క్యాంప్‌కు హాజరై ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. సదరం క్యాంప్‌లను నెలలో రెండు, మూడు రోజులు మాత్రమే నిర్వహిస్తారు. ఉన్నతాధికారులు సూచించిన తేదీల్లోనే శిబిరాలకు హాజరు కావాలి. దాని కోసం ముందుగా మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

రెన్యువల్ కోసం..

కొన్ని రకాల వైకల్యాలకు సంబంధించి సదరం శిబిరాల్లో తాత్కాలిక వైకల్యం సర్టిఫికెట్ ఇస్తుంటారు. ఇప్పుడు వైకల్యం ఉన్నా కొంతకాలానికి వ్యాధి నయం కావచ్చనే ఉద్దేశంతో కాలపరిమితితో కూడిన సర్టిఫికెట్లు జారీ చేస్తారు. ఒక వేళ వైకల్యం అలాగే ఉంటే మరోసారి శిబిరానికి హాజరై రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా సదరు వెబ్‌సైట్ రెండు నెలలుగా పని చేయడం లేదు. జిల్లా వ్యాప్తంగా గతంలో 706 మంది స్లాట్‌లు బుక్ చేసుకోగా ఈ నెల 3 విడతల్లో సదరం క్యాంప్‌లు నిర్వహించి 336 మందికి వైద్య పరీక్షలు చేశారు. మరో 370 మంది వెయిటింగ్‌లో ఉన్నారు. ఓ వైపు వారంతా సదరం క్యాంప్ ఎప్పుడు పెడతారా అని ఎదురు చూస్తున్నారు. మరో వైపు వెబ్‌సైట్ రాకపోవడంతో రెన్యువల్ అవసరం ఉన్న దివ్యాంగులు పింఛన్ కోల్పోతున్నారు. జిల్లాలో వివిధ రకాల పింఛన్‌లు మొత్తం 1,64,397 ఉన్నాయి. ఇందులో 18,080 దివ్యాంగ పింఛన్‌లు ఉన్నాయి. దివ్యాంగ పింఛన్‌లలో 25 శాతం వరకు తాత్కాలిక సర్టిఫికెట్‌తో పొందుతున్న వారు ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో చాలా మంది దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోకపోవడంతో పింఛన్ ఆగిపోయి ఇబ్బందులు పడుతున్నారు. వెబ్‌సైట్‌ను పునరుద్ధరించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



గాంధారికి చెందిన ఆర్ భూంరెడ్డికి మూడేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. దీంతో దివ్యాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. సదరం క్యాంప్ ద్వారా 84 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు గుర్తించి తాత్కాలిక వైకల్యం కింద నమోదు చేస్తూ సర్టిఫికెట్ ఇచ్చారు. జూన్ 2తో సర్టిఫికెట్ కాలపరిమితి ముగియడంతో పింఛన్ ఆగిపోయింది. కానీ వైకల్యం మాత్రం అలాగే ఉంది. మళ్లీ మీ సేవ కేంద్రం ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సదరం సర్టిఫికెట్ తీసుకుంటే అధికారులు పింఛన్‌ను పునరుద్ధరిస్తారు. కానీ సదరం స్లాట్ బుకింగ్‌కు సంబంధించిన వెబ్‌సైట్ రెండు నెలలుగా పని చేయడం లేదు.

వెబ్‌సైట్ రావట్లేదు అంటున్నారు



నా సదరం సర్టిఫికెట్ కాలపరిమితి ఈ నెల 24 తో ముగిసింది. సదరం శిబిరానికి హాజరు కావాల్సి ఉంది. కానీ వెబ్‌సైట్ రావడం లేదని మీసేవ వాళ్లు చెబుతున్నారు. పింఛన్ పైనే ఆధారం. సదరం సర్టిఫికేట్ లేక పింఛన్ ఆగిపోతే ఇబ్బందులు తప్పవు.

– ఎం రాములు, దివ్యాంగుడు, గాంధారి

బిడ్డ అనారోగ్యం తట్టుకోలేక..

- 18 నెలల చిన్నారితో చెరువులో దూకి తండ్రి బలవన్మరణం
- కుటుంబ సభ్యులు క్షమించాలంటూ సూసైడ్ నోట్




నేహశ్రీ (ఎడమ), చిన్న కూతురితో క్రాంతికుమార్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఒక వైపు 18 నెలల కుమార్తెకు తీవ్ర అనారోగ్య సమస్య.. మరోవైపు ఆర్థిక భారం.. వెరసి తీవ్ర మానసిక క్షోభతో నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ మాసాని చెరువులో కూతురుతో సహా దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు ఓ తండ్రి. వెళ్లిపోతున్నా.. క్షమించాలంటూ భార్య మానస, కుటుంబ సభ్యులకు సూసైడ్ నోట్ రాసి తనువు చాలించాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ నగరంలోని ఇంద్రాపూర్‌కు చెందిన రఘుపతి క్రాంతికుమార్ (35)కు జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన మానసతో వివాహమైంది. వీరికి 18 నెలల నేహశ్రీ , 3 నెలల వయస్సుగల మరో పాప ఉంది. నేహశ్రీ అంటే తండ్రికి ఎనలేని ప్రేమ. క్రాంతికుమార్ డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని గురుకుల పాఠశాలలో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నేహశ్రీకి మానసిక అనారోగ్యం కారణంగా రెండు సార్లు బ్రెయిన్ ఆపరేషన్ చేయించాడు. వైద్య ఖర్చులు పెరిగిపోయాయి. అయినప్పటికీ కూతురు ఆరోగ్యం మెరుగుపడలేదు. మరోవైపు అప్పులు తీర్చే మార్గం లేక క్రాంతికుమార్ నిత్యం మనస్తాపానికి గురయ్యేవాడు. క్రాంతికుమార్ తన జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి ఇంట్లో స్నేహితులతో జరుపుకున్నాడు. రోజంతా సంతోషంగా గడిపిన ఆయన పెద్ద కుమార్తెతో కలిసి నిద్రించాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో నేహ శ్రీని వెంట బెట్టుకుని బైక్‌పై మాసాని చెరువు కట్టకు చేరుకుని కూతురితో కలిసి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

చెరువు కట్టపై బైక్‌ను నిలిపి..

సోమవారం ఉదయం భర్త క్రాంతికుమార్, పెద్ద కుమార్తె నేహ శ్రీ కన్పించకపోవడంతో మానస ఆందోళనకు గురైంది. వెంటనే తల్లిదండ్రులు, బంధువులకు సమాచారమివ్వగా, వారంతా వారి కోసం గాలించారు. క్రాంతికుమార్ బైక్ మాసాని చెరువు కట్టపై కన్పించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికి తీయించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. క్రాంతికుమార్ సూసైడ్ నోట్‌లో సారీ అమ్మ, నాన్న, భార్య, చెల్లె, తమ్ముడు.. తాను వెళ్లిపోతున్నానని, భార్య మానస చిన్న కుమార్తెను మంచిగా చూసుకోవాలని, సంతోషంగా ఉండాలని రాసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



భిక్కనూరు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. మండలంలోని జంగంపల్లి జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను సోమవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. బియ్యం, ఇతర సరుకులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. తహసీల్దార్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ విమల తదితరులు పాల్గొన్నారు.

కేసుల విచారణ వేగవంతం చేయాలి

- ఎస్పీ సింధు శర్మ



మాట్లాడుతున్న ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయాలని ఎస్పీ సింధు శర్మ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పీఎస్‌ల వారీగా కేసుల వివరాలను తెలుసుకున్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. హిస్టరీ షీట్ ఉన్నవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీ మరింతగా పెంచాలని సూచించారు. సైబర్ క్రైం, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు పోలీస్ అధికారులకు ఎస్పీ ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలి



ఎల్లారెడ్డి: విద్యార్థులు బాగా చదివి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్‌లోని బియ్యం, కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వార్డెన్ శారద, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల తనిఖీ



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి కస్తూర్బా పాఠశాలను ఎంఈవో రాజగంగారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.

బీసీ హాస్టల్ ..



దోమకొండ: మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను సోమవారం రాత్రి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులు, వార్డెన్ స్వామితో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పిల్లలకు అందించాలని సూచించారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతిని పరిశీలించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

● డీఐఈవో రవికుమార్



నిజామాబాద్‌నాగారం: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. మేరా యువభారత్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా సోమవారం సుభాష్‌నగర్‌లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన 14 బృందాలు పాల్గొన్నాయి. కార్యాక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో డివిజన్ స్థాయిలో కూడా మరిన్ని పోటీలు నిర్వహించి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన బృందాలకు బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు, మేరా యువ భారత్ అందించిన నూతన డైరీలను అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్, పోటీల నిర్వాహకురాలు, జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్, కళాశాలల, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

బోధన్‌టౌన్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బోధన్‌పట్టణంలోని రవిగార్డెన్ సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ వెంకట్‌నారాయణ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం అమందాపూర్‌కు చెందిన సతీశ్‌గౌడ్(31) తన మిత్రుడితో కలిసి రవిగార్డెన్ రోడ్డు మీదుగా రాయకూర్‌కు వెళ్తుండగా పట్టణానికి చెందిన సాయాగౌడ్ రాయకూర్ నుంచి బోధన్‌కు వస్తుండగా రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో సతీశ్‌గౌడ్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

మోర్తాడ్ డిగ్రీ కళాశాలకు కొత్త సొబగులు

- అదనపు గదుల నిర్మాణం, విద్యా సామగ్రికి రూ.5 కోట్లు మంజూరు
- పీఎం ఉషా పథకం కింద నిధులు మంజూరు చేసిన కేంద్రం



మోర్తాడ్ డిగ్రీ కళాశాల భవనం

మోర్తాడ్: మోర్తాడ్ డిగ్రీ కళాశాలకు కొత్త సొబగులు దిద్దుకుంటున్నాయి. అదనపు గదుల నిర్మాణం, విద్యా సామాగ్రికి ప్రధాన మంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్(పీఎం ఉషా) పథకం కింద రూ.5 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులు అందుకున్న ఏకైక కళాశాల మోర్తాడ్ కావడం విశేషం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మోర్తాడ్‌కు డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా తెలంగాణ ఆవిర్భవం తర్వాత నిర్మాణం పూర్తి చేసుకుంది. బీఏ, బీకాం కంప్యూటర్స్, జనరల్, బీఎస్సీ మ్యాథ్స్, బీజెడ్‌సీ, కంప్యూటర్స్ కోర్సుల్లో విద్యార్థులకు ఉన్నత విద్య అందుతోంది. ఇంగ్లీష్, తెలుగు మీడియాల్లో బోధన సాగుతోంది. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల, వేల్పూర్ మండలాల విద్యార్థులకు డిగ్రీ విద్యను అందిస్తున్న మోర్తాడ్‌లో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయవచ్చని అధికారులు భావించారు. ఇదిలా ఉండగా ఉన్నత విద్యామండలి చొరవతో ఉద్యోగ అర్హత పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. ఎన్‌సీసీ కెడెట్ క్యాంప్‌ను ఏర్పాటు చేయడానికి ఆర్మీ అధికారులు పరిశీలన చేపట్టారు. ఇప్పటికే ఎన్ఎస్ఎస్ క్యాంపులను నిర్వహిస్తూ విద్యార్థులను సమాజ సేవలో తరలించేలా అధ్యాపకుల బృందం కృషి చేస్తోంది. అదనపు గదుల నిర్మాణం, విద్యా సామాగ్రి కొనుగోలుతో విద్యార్థులకు మరిన్ని మెరుగైన విద్య సేవలు అందడానికి అవకాశం ఏర్పడనుంది. పీఎం ఉషా పథకం కింద మంజూరైన నిధులతో అదనపు గదులను ప్రస్తుతం ఉన్న భవనంపై నిర్మించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అదనపు గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు పీజీ సెంటర్ కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



అదనపు గదుల నిర్మాణానికి జరుగుతున్న ఏర్పాట్లు

వైభవంగా వీరభద్రుడి ఉత్సవాలు



మద్నూర్(జుక్కల్): హర హర మహాదేవ్ అంలూ భక్తులు వీరభద్రుడి దండకాల మధ్య భక్తులు నిప్పు కణికలపై నడిచారు. రెండు రోజులుగా మద్నూర్ మండల కేంద్రంలో జరుగుతున్న వీరభద్రుడి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానికులతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలకు చెందిన భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకి ఊరేగింపు కార్యక్రమం జరిగింది.

దక్ష యజ్ఞం..

వీరభద్రుని ఉత్సవాల సందర్భంగా దక్షయజ్ఞం (అగ్నిగుండం) నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నిప్పు కణికలపై నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ప్రతి సంవత్సరం ఈ ఆలయంలో అగ్నిగుండంపై నడవడం సంప్రదాయబద్ధంగా వస్తోంది.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



బాన్సువాడ: బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం శివపార్వతులకు పట్టు వస్త్రధారణ చేసి, కల్యాణ వేడుక చేపట్టారు. వేదపండితులు జపాల చంద్రశేఖర్‌శర్మ, పురుషోత్తం రావు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కిటకిటలాడిన సిద్దరామేశ్వరాలయం

భిక్కనూరు: భిక్కనూరు సిద్దరామేశ్వరాలయం కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వేదబ్రాహ్మణులు సిద్దగిరిశర్మ, రామగిరి శర్మ, రాజేశ్వరశర్మలు స్వామివారికి భక్తులతో అభిషేకాలు చేయించారు.



కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ఎల్లారెడ్డిరూరల్: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాలు భక్తులు కిటకిటలాడాయి. పట్టణంలోని నీలకంఠేశ్వరాలయం,రాజరాజేశ్వరాలయం, సోమయాజుల శివాలయంలో భక్తులు శివుడికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలను నిర్వహించారు.

నాగిరెడ్డిపేట పరిధిలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కార్తీకమాస ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు శివాలయం, రామాలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. తాండూర్ శివారులో గల త్రిలింగేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చీనూర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. 33 జంటలు

తిరుపతిని దర్శించుకున్న చైర్‌పర్సన్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తిరుపతిలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆమె వెంట భర్త గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కుటుంబ సభ్యులున్నారు.

29న మహారుద్ర హోమం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ గ్రామ శివారులో గల త్రిలింగేశ్వరాలయం వద్ద ఈ నెల 29న మహా రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మ దత్తు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. దీంతోపాటు 9 గంటల నుంచి 11 గంటల వరకు 101 మంది జంటలతో మహారుద్ర హోమం జరుపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. యజ్ఞంలో పాల్గొనాలకునే దంపతులు రూ.1,116 చెల్లించాలని చెప్పారు.

క్రైం కార్నర్

కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య



శారద(ఫైల్)

ఎల్లారెడ్డి: కడుపునొప్పి భరించలేక ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి తండాలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం ..తిమ్మారెడ్డి తండాకు చెందిన దరావత్ శారద(28) కొన్ని నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త దేవీసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

గూపన్‌పల్లిలో యువకుడు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని గూపన్‌పల్లికి చెందిన పవన్(24) అనే యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ పేర్కొన్నారు. స్థానికులు, ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. పవన్ బైపాస్ రోడ్డులో ఉన్న లహరి హోటల్‌లో పనిచేస్తుండేవాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకి చెందిన మంత్రి రూపేశ్ యాసిడ్ తాగడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నాందేవ్‌వాడకు చెందిన రూపేశ్‌కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా అతను మద్యానికి బానిస కావడంతో భార్య వదిలి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తితో ఆదివారం యాసిడ్ తాగాడు. గమనించిన తల్లి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని చిన్నాబజార్‌లో షార్ట్‌సర్క్యూట్‌లో ఓ ఇల్లు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. చిన్నాబజార్‌లో ఉన్న దొండి స్వామి ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజు ఇల్లు కాలిపోయింది. ఇంటి నుంచి పొగలు రావడంతో స్థానికులు చూసి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఘటన స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి, ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు.

సిర్పూర్‌లో గుడిసె ..



డొంకేశ్వర్: మండలంలోని సిర్పూర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మాడవేడి సాయమ్మకు చెందిన నివాసపు గుడిసె దగ్ధమైంది. గుడిసెలో దేవుడి ఫొటో వద్ద దీపం వెలిగించగా ప్రమామదం చోటు చేసుకుంది. కాలిపోయిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రూ.30వేల వరకు నగదు, చేపలు పట్టే వలలు, ఇతర సామాగ్రి కాలిపోయాయి. దీంతో చేపలు పట్టుకుంటూ జీవిస్తున్న కుటుంబం రోడ్డున పడింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్



నీలా చౌరస్తాలో తనిఖీలు చేపడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

రెంజల్: ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బోధన్ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమన్వయంతో ఇసుక అక్రమ కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శనివారం అర్ధరాత్రి మండలంలోని నీలా, కందకుర్తి గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో తనఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. నిత్యం రెవెన్యూ, పోలీసు సిబ్బందితో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నట్లు పేర్కొన్నారు.

మూడు ఇసుక లారీల సీజ్



బాల్కొండ: మోర్తాడ్ మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు మోర్తాడ్ ఎస్సై విక్రమ్ తెలిపారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించి పట్టుకున్నామని, సీజ్ చేసిన ఇసుకను మైనింగ్ శాఖకు అప్పగించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతి అదృశ్యం

నస్రుల్లాబాద్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఏఎస్సై అబీద్ బేగ్ సోమవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ యువతి రెండు రోజుల క్రితం కాలేజీకి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

పిట్లం ప్రజావాణికి రెండు ఫిర్యాదులు



పిట్లంలో ఫిర్యాదు చేస్తున్న బాధితుడు



తాడ్వాయి ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

పిట్లం(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఈ ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు ఏమైన సమస్యలు ఉంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలన్నారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. ఏమైనా సమస్యలుంటే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. తహసీల్దార్ రహిమొద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఏవో నర్సింలు, సూపర్‌వైజర్ శివలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: సమగ్ర సర్వే త్వరితగతిన పూర్తి చేసి వివరాల నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించినట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. అదేవిధంగా రాజంపేటలోని కేజీబీవీ పాఠశాలలో నాణ్యమైన భోజనం గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రఘురాం, ఎంఈవో పూర్ణచంద్రరావ్, ఏవో శృతి, తదితరులున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొల్లూర్, నాగారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఎటువంటి ట్యాక్సులు లేకుండా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఎస్సీ, ఎస్టీలకు ఇంటి ఆడబిడ్డ అకౌంట్లో రూ.6 లక్షలు, మిగిలిన వారికి రూ.5 లక్షల చొప్పున జమవుతాయన్నారు. సొంత ఇళ్లులేని నిరుపేదలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అభివృద్ధి నిరోధకులు, నిత్యం ప్రజల మధ్య చిచ్చుపెట్టే వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల సౌకర్యార్థం నాగారం డబుల్ బెడ్‌రూం పీఎస్ఆర్ కాలనీ నుంచి పంటపొలాల వరకు రూ.50 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. కొల్లూర్, నాగారం గ్రామాల ప్రజల కోసం రూ.40లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన జనరల్ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించారు. ప్రతి గ్రామంలో జనరల్ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ నిధులతో గ్రామంలో నిర్మించిన 50 డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, ఎంపీడీవో బషీరుద్దీన్, నాయకులు వెంకట్రాంరెడ్డి, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, నార్లసురేష్, పిట్ల శ్రీధర్, మధుసూదన్ రెడ్డి, మొగులయ్య, గంగారాం తదితరులు పాల్గొన్నారు.



ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక



అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం 10వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ అండర్–8, 10, 12 బాలబాలికల ఎంపికలు స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించారు. ఐదువందలకు పైగా క్రీడాకారులు పాల్గొనగా అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులకు బంగారు, వెండి, కాంస్య పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 1న మంచిర్యాల జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన వారిలో ఎం సిద్దేశ్వర్, ఎ సాయిశ్రేష్ఠ, ఎం విరాట్, జె లక్ష్మణ్, కె కార్తికేయ, ఎస్‌కే జోయా, కె అఖిల, ఎం మనీష, ఎ భార్గవ్‌రెడ్డి, ఎస్ దేవదాస్, ఎం వరుణ్, ఎం రాణప్రతాప్, ఎ అనిల్, టి కృష్ణవేణి, ఎం స్నేహ, జి భాగ్యశ్రీ,, జి మధుప్రియ, కె శృతిక, కె సింధు, కె సాయిచిల్సియా రాథోడ్ ఉన్నారు. కార్యక్రమంలో పద్మపాణి సంస్థ డైరెక్టర్ స్వర్ణలత, మేనేజర్ అరుణిమ, ప్రతినిధులు ఆర్ వెంకటేశ్వరగౌడ్, అరుణ, సరిత, రేణుక, మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు

కామారెడ్డి క్రైం: ఒంటరి మహిళలను టార్గెట్ చేసి వారిని హత్య చేసి వారి మెడలో ఉన్న బంగారాన్ని దోచుకెళ్లడమే వారికి అలవాటు.. గతంలో వారు అనేక కేసుల విషయంలో జైలు జీవితాన్ని గడిపి బయటకి వచ్చినా వారి తీరు మాత్రం మారలేదు. ఈనెల 20న ఓ మహిళను హత్య చేసి ఆమె మెడలో ఉన్న బంగారాన్ని దోచుకెళ్లిన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం కంచర్లలో చోటుచేసుకుంది. హత్యకు సంబంధించిన వివరాలను కామారెడ్డి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు వెల్లడించారు. భిక్కనూర్ మండలం కంచర్ల శివారులో ఈ నెల 20న మహిళ హత్య కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ భూమిలో పని చేస్తున్న సుగుణ తలపై దుండగులు కొట్టి హత్య చేసి, ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాన్ని దొంగిలించారు. ఈ కేసులో అల్లెపు మల్లయ్య అనే నిందితుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా, నిందితులు నవీన్, ప్రసాద్, సాలవ్వలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. నిందితులు బీబీపేట్ మండలం యాడారం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. నిందితుల నుంచి బంగారాన్ని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదే విధంగా గతంలో నిందితులపై పలు కేసులు ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు..

ఖలీల్‌వాడి: న్యాయవాదిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రెండోటౌన్ పీఎస్ పరిధిలోని ఖిల్లా ప్రాంతంలో న్యాయవాది ఖాసీంకు చెందిన షెటర్‌ను ముగ్గురు వ్యక్తులు తమకు విక్రయించాలంటు అదే ప్రాంతానికి చెందిన తండ్రి, కొడుకులు ముజఫర్ ఖాన్, హర్షద్‌ఖాన్‌తో పాటు మరొకరు దాడి చేశారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



కామారెడ్డి క్రైం: తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ జరిగిన ఘటన జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన నర్సయ్య తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి దొంగలు పడినట్లు గుర్తించారు. కొద్ది దూరంలో ఉండే రాజు అనే వ్యక్తి ఇంట్లో కూడా ఇదే విధంగా చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీం బృందాన్ని పిలిపించి ఆధారాలు సేకరించారు. ఆయా ఇండ్లలో తులంన్నర బంగారు ఆభరణాలు, 22 తులాల వెండి,రూ. 30 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. విచారణ చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గురురాఘవేంద్ర కాలనీలో..

కామారెడ్డి క్రైం: మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని గురురాఘవేంద్ర కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై రాజు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన వేర్పుల మల్లేశం తన కుటుంబీకులతో కలిసి ఈనెల 23న బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం ఇంటికి తాళం వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. బీరువాలో దాచి ఉంచిన తులంన్నర బంగారం, వెండి, నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కను ఢీకొని ఒకరికి గాయాలు

నస్రుల్లాబాద్: మండల కేంద్రానికి చెందిన దిలీప్ అనే వ్యక్తి సోమవారం సాయంత్రం బాన్సువాడకు బైక్‌పై వెళ్తుండగా కామిశెట్టిపల్లి వద్ద కుక్కను ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.